డీఎంహెచ్‌వోపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

జగిత్యాల కలెక్టరేట్, మే 25 : జగిత్యాల జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసినట్లు జగిత్యాల సీఐ వేణుగోపాల్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. 104లో డ్రైవర్‌గా పనిచేస్తున్న కొప్పుల రాజకుమార్(49)ను మూడు రోజుల నుంచి ఇంటికి వెళ్లనీయకుండా డీఎంహెచ్‌వో పుప్పాల శ్రీధర్ తన కార్యాలయంలో బలవంతంగా విధులు చేయించుకుంటూ కులం పేరుతో దూషిస్తూ వేధించేవాడని, ఆయన ఒత్తిడి, వేధింపులను తట్టుకోలేక రాజకుమార్ శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడని మృతుడి అక్క గోస్కుల యశోద ఫిర్యాదు చేసింది. రాజకుమార్‌ను వేధింపులకు గురిచేసి మృతికి కారకుడైన డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు డీఎంహెచ్‌వోపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అంతర్జాతీయ తెరపై మెరిసిన హుజూరాబాద్ యువతేజం

స్వార్థిక్ షార్ట్‌ఫిల్మ్ 'ది రోడ్ నాట్ టేకేన్'కు అమెరికా అవార్డు

ఆర్డియన్స్ చాయిస్ అవార్డుతో స్వార్థిక్ దంపతులు

హుజూరాబాద్ రూరల్, మే 25: హుజూరాబాద్‌కు చెందిన ఎన్ఆర్ఐ స్వార్థిక్ అంతర్జాతీయ వెండితెరపై మెరిశారు. ఆయన తెరకెక్కించిన షార్ట్‌ఫిల్మ్ 'ది రోడ్ నాట్ టేకేన్'కు అమెరికాకు చెందిన ప్రముఖ మీడియా సంస్థ ఇండిమీమ్ ఈ నెల 10న ఆర్డియన్స్ చాయిస్ అవార్డును ప్రదానం చేసింది. హుజూరాబాద్‌లో ఉంటున్న స్వార్థిక్ తండ్రి బొల్లు రాజేందర్ శనివారం వివరాలు వెల్లడించారు. రాజేందర్-వరూధిని దంపతుల కొడుకు స్వార్థిక్ 2015లో అమెరికాకు వెళ్లాడు. 2017లో హూస్టన్ యూనివవర్సిటీలో ఎమ్మెస్ పూర్తి చేశాడు. అనంతరం సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తూనే లఘు చిత్ర నిర్మాణంలో ఆసక్తిచూపాడు. అమెరికాకు చెందిన కవి రాబర్ట్ ఫ్రాస్ట్ రాసిన 'ది రోడ్ నాట్ టేకెన్' కవితలోని సారాంశం, జర్మన్ నావెలిస్ట్ ఫ్రాంజ్ కాఫ్కా రాసిన 'మెటమార్ఫోసిస్' నవలలోని విషాదభరితమైన స్టోరీ ఆధారంగా 14 నిమిషాల నిడివితో షార్ట్‌ఫిల్మ్‌ను తెరకెక్కించాడు. ఆయన ప్రతిభను గుర్తించి ఇండిమీమ్ అవార్డును ప్రకటించింది.

హనుమాన్ శోభాయాత్రలో ఉద్రిక్తత

కరీంనగర్ రాంనగర్, మే 25: నగరంలోని హనుమాన్ భక్తుల శోభాయాత్రలో ఉద్రిక్తత నెలకొన్నది. అనుమతి మేరకు ఆదర్శనగర్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమైన కొద్ది సేపటికే, మంచిర్యాల చౌరస్తాలో ఓ ఆగంతకుడు తల్వార్‌తో వచ్చి వీరంగం సృష్టించాడు. త్రీటౌన్ పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీస్ వాహనంలో తరలించే ప్రయత్నం చేయగా, ఆ ఆగంతకుడిని తమకు అప్పగించాలంటూ హనుమాన్ భక్తులు ఆందోళన చేశారు. పోలీస్ వాహనాన్ని వెంబడించి, పెట్రోకార్‌పై దాడికి పాల్పడి అద్దాలు ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు హనుమాన్ భక్తులను చెదరగొట్టి ఆగంతకున్ని స్టేషన్‌కు తరలించగా, హనుమాన్ భక్తులు రోడ్డుపై బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీస్ ఉన్నతాధికారులు స్పెషల్ యాక్షన్ టీంలను రంగంలోకి దింపి వారిని గుడికి తరలించారు. అయినప్పటికీ తిరిగి రావడంతో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు వైశ్యభవన్, గాంధీరోడ్, మంచిర్యాల చౌరస్తాలో పికెటింగ్‌లను ఏర్పాటు చేశారు. కాగా, పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యక్తిని విడిచిపెట్టాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలు త్రీటౌన్ ఎదుట ధర్నాకు దిగారు. స్టేషన్‌లోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నం చేయడంతో ప్రత్యేక బలగాలు సుమారు వంద మందిని అరెస్ట్ చేసి పీటీసీకి తరలించారు. ఈ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారి మాట్లాడుతూ వాల్మీకినగర్‌కు చెందిన జయదేవ్ మద్యం మత్తులో తల్వార్‌తో వీరంగం సృష్టించాడని తెలిపారు. అతన్ని అప్పగించాలంటూ బీజేపీ శ్రేణులు ఆందోళన చేయడంతో అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ గొడవలకు ప్రధాన కారణమైన మరో యువకున్ని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ప్రభుత్వ కాలేజీల.. ప్రచార బాట

- ప్రవేశాల కోసం ఇంటింటికీ ఇంటర్ అధ్యాపకులు
- ప్రైవేట్‌కు దీటుగా ముందుకు
- సోషల్ మీడియాలోనూ క్యాంపెయినింగ్
- కేసీఆర్ సర్కార్ చేసిన సంస్కరణలు చూపి విద్యార్థులను ఆకర్షించే ప్రణాళికలు
- ఈ యేడాది అడ్మిషన్లకు ప్రతిబంధకంగా ఫలితాలు
- ఆందోళనలో లెక్చరర్లు, ప్రిన్సిపాళ్లు

ప్రభుత్వ కాలేజీలు ప్రచార బాట పట్టాయి. వచ్చే విద్యాసంవత్సరం ప్రవేశాల కోసం విద్యార్థుల ఇంటి తలుపులు తడుతున్నాయి. ప్రైవేట్‌కు దీటుగా ప్రతి విద్యార్థి, వారి తల్లిదండ్రులను కలుస్తూ చేరితే కలిగే ప్రయోజనాలు, వసతి సౌకర్యాల గురించి అవగాహన కల్పిస్తున్నాయి. గత పదేండ్లలో కేసీఆర్ సర్కారు తెచ్చిన సంస్కరణలు, కళాశాలలో జరిగిన మార్పులను వివరిస్తూ ఆకర్షించే ప్రయత్నాలు చేయడమేకాదు ఒక అడుగు ముందుకేసి సోషల్ మీడియాలోనూ క్యాంపెయినింగ్ మొదలుపెట్టాయి. గడప గడపకూ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నప్పటికీ, ఈ యేడు ప్రభుత్వ కాలేజీల్లో తగ్గిన పాస్ పర్సంటేజ్ అడిషన్లకు ప్రతిబంధకంగా మారింది. ఇలా అయితే ప్రవేశాలు టార్గెట్ ఎలా..? అని లెక్చరర్లు, ప్రిన్సిపాళ్లలో ఆందోళన వ్యక్తమవుతున్నది.

ప్రచారం చేస్తున్న వివిధ ప్రభుత్వ కాలేజీల లెక్చరర్లు

జగిత్యాల, మే 25 (నమస్తే తెలంగాణ): విశాలమైన తరగతి గదులు, మైదానాలు, గ్రంథాలయాలు, అనుభవజ్ఞులైన ఉపన్యాసకులతో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. అయితే ఇవేమీ ప్రైవేట్ కాలేజీల్లో లేకున్నా రంగురంగుల కరపత్రాలు ముద్రించి, గతేడాది సాధించిన ఫలితాలను దాచిపెట్టి, మాటల గారడీతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ప్రలోభపెట్టి అడ్మిషన్లు పొందుతున్నాయి. ఒకప్పుడు ప్రైవేట్ కాలేజీల జోరుకు ప్రభుత్వ కాలేజీలు వెల్లకిలా పడిపోయాయి. విద్యార్థులు లేక, పాఠాలు ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితులు ఉండగా.. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితానిచ్చాయి. సకల వసతులతో సర్కారు కళాశాలలు జీవం పోసుకున్నాయి. ఉచిత విద్య, ఉచితంగా పాఠ్యపుస్తకాల పంపిణీ, బస్‌పాస్ సౌకర్యం తదితర అంశాలతో పాటు సాధించిన ఫలితాలను ప్రధానంగా చేసుకొని గవర్నమెంట్ కాలేజీలు ప్రచారం చేస్తున్నాయి. వాస్తవ పరిస్థితులను పేర్కొంటూ, సౌకర్యాలు, సౌలభ్యాలను చూపుతూ ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి. ఫలితాల కరపత్రాలు, బ్యానర్లు, గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో అందించే నాణ్యమైన బోధన, మెరుగైన సౌకర్యాలు ప్రైవేట్ కాలేజీల్లో ఉండవని అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు స్పష్టం చేస్తున్నారు.

ఫిబ్రవరి నుంచే రంగంలోకి

ప్రభుత్వ కాలేజీల అధ్యాపకులు గత ఫిబ్రవరి నుంచే పదో తరగతి విద్యార్థుల వివరాలను సేకరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి వారిని ఇప్పటికే కలిశారు. ఫలితాలు వెలువడిన తర్వాత గ్రామాల్లో విద్యార్థుల ఇండ్లకు స్వయంగా వెళ్లి వివరాలను తెలియజేసి, కాలేజీల్లో చేర్చుకునేందుకు యత్నిస్తున్నారు. ఇప్పుడు అన్ని జూనియర్ కాలేజీల్లోను ఉపన్యాసకులు విద్యార్థులను చేర్పించేందుకు ప్రత్యేక క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నారు. తోటి లెక్చరర్లు, విద్యార్థులు, స్నేహితుల్లోనూ చైతన్యం కలిగించేందుకు సోషల్ మీడియాల్లోనూ ప్రచారం చేస్తున్నారు.

విద్యార్థుల వివరాలను నమోదు చేస్తూ..

నాణ్యమైన విద్య, సౌకర్యాలు

మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్యను అందించడంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మెరుగ్గానే పనిచేస్తున్నాయని చెప్పక తప్పదు. దీనికి తోడు తొలి సీఎం కేసీఆర్ ఇంటర్ విద్యారంగంలో సంస్కరణలు చేపట్టడం కాలేజీల మనుగడకు కలిసివచ్చింది. రాష్ట్రం ఏర్పడగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం కోట్లాది నిధులు విడుదల చేసింది. ప్రతి కాలేజీకి ప్రహరీ నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రక్షిత మంచినీటి ప్లాంట్ల కోసం కాలేజీకి ₹2.5 లక్షలు కేటాయించారు. కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతి జూనియర్ కాలేజీలోనూ ప్రయోగశాలలను ఆధునీకరించారు. బీర్‌పూర్, ధర్మారం, సారంగాపూర్, కొడిమ్యాల వంటి మారుమూల కాలేజీల భవనాల నిర్మాణాలు పూర్తి చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులు సైతం కనీస ఫీజును చెల్లించాల్సి ఉండేది. అయితే రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటర్ విద్యను పూర్తిగా ఉచితంగా మార్చివేసింది. ఉమ్మడి జిల్లాలోని కాలేజీలకు ₹16 కోట్ల నిధులను ఫీజుల కోసం మంజూరు చేశారు. దీంతో కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులకు ఎలాంటి రుసుం చెల్లించే అవసరం లేకుండా పోయింది. దీనికి తోడు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేసింది. అలాగే ప్రతి కాలేజీకి ₹2.50 లక్షల విలువైన క్రీడా సామగ్రిని అందించింది. వీటితో పాటు, జూనియర్ కాలేజీల్లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసులను కేసీఆర్ ప్రభుత్వం క్రమబద్ధీకరించడంతో అన్ని జూనియర్ కాలేజీల్లో పూర్తి స్థాయి బోధన సిబ్బంది అందుబాటులో ఉంది.

దశాబ్దకాలంగా 70శాతానికిపైగా ఫలితాలు

అడ్మిషన్ల కోసం జూనియర్ కాలేజీ లెక్చరర్లు విస్తృతంగా కృషి చేస్తున్నా గతేడాది వచ్చిన రిజల్ట్స్ ఇబ్బందులు పెడుతున్నాయి. దశాబ్దకాలంగా ఇంటర్‌లో 70 శాతానికి పైగా ఫలితాలతో దూసుకుపోయిన జగిత్యాల ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ఈ సారి అందుకు విరుద్ధమైన ఫలితాలు తెచ్చుకున్నాయి. ఏప్రిల్ 24న ప్రకటించిన ఫలితాల్లో జిల్లా కాస్త నిరాశపర్చింది. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలో 21వ స్థానంలో నిలిచిన జిల్లా, జూనియర్ ఇంటర్‌లో 25వ స్థానానికి పడిపోయింది. పదేండ్లల్లో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ కాలేజీలు ఈ సారి తక్కువ ఫలితాలను తెచ్చుకోవడం ఆందోళనకు గురి చేస్తున్నది. ఈ ఫలితాలు అడ్మిషన్లపై ప్రభావం చూపనుండగా, ఈ విషయమై సీనియర్ ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు మాట్లాడారు. ప్రభుత్వ కాలేజీలు మెరుగైన ఫలితాలు సాధిస్తూ వచ్చాయని, ఈ యేడాది ఫలితాలు తగ్గడం నిశాశజనకమని చెప్పారు. ఎన్ని సౌకర్యాలు కల్పించినా, ఉచిత విద్యను అందించినా, మెరుగైన ఫలితాలు రాకపోతే ఇబ్బందేనని అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలను తప్పకుండా సాధిస్తామని స్పష్టం చేస్తున్నారు.

'తుమ్మేటి'కి కాంగ్రెస్ షోకాజ్ నోటీస్

పార్టీ నుంచి పలువురి బహిష్కరణ

జమ్మికుంట, మే 25 : టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జీ చెన్నారెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట పట్టణం, మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు కసుబోజుల వెంకన్న, ఒల్లాల శ్రీనివాస్, ఎండీ సలీం, ఎండీ ఇమ్రాన్, ఎండీ సలీం పాషా, వాసాల రామస్వామిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నామని, నియోజకవర్గ నాయకుడు తుమ్మేటి సమ్మిరెడ్డికి షోకాజ్ నోటీసు ఇస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వీ ప్రణవ్‌బాబుపై ఉద్దేశపూర్వకంగా చేసిన అసందర్భ ఆరోపణలు, అంతర్గతంగా చర్చించుకోవాల్సినవి మీడియా సమావేశంలో వెల్లడించడంపై స్థానిక పార్టీ శ్రేణుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు అందులో పేర్కొన్నారు. పార్టీ ఇచ్చిన హామీలపై విశ్వాసం ఉంచి ప్రజలు ఓట్లేశారని తెలిపారు. తమ వల్లనే ఓట్లు పడ్డాయని ప్రజలను అయోమయానికి గురి చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని చెప్పారు. బహిష్కరణకు గురైన వ్యక్తులకు పార్టీతో ఇప్పటి నుంచి ఎలాంటి సంబంధమూ ఉండదని స్పష్టం చేశారు. అలాగే, సీనియర్ నాయకుడని తనకు తానే ప్రచారం చేసుకుంటున్న తుమ్మేటి సమ్మిరెడ్డి వారం రోజుల లోపు షోకాజ్ నోటీసుకు రిప్లై ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్ నాయకుల బహిష్కరణ, షోకాజ్ నోటీసులపై స్థానికంగా సర్వత్రా చర్చనీయాంశమైంది.

వయాకామ్18-స్టార్ ఇండియా విలీనం!

సీసీఐ అనుమతి కోరిన రిలయన్స్ ఇండస్ట్రీస్

న్యూఢిల్లీ, మే 25: మీడియా విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ముకేశ్ అంబానీ మరో అడుగుముందుకేశారు. వయాకామ్ 18, స్టార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లను విలీనానికి సంబంధించి కాంపిటేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) అనుమతి కోరారు. ఈ రెండు సంస్థలు విలీనమైన తర్వాత ఏర్పడే సంస్థ విలువ 8.5 బిలియన్ డాలర్లు. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన వయాకామ్ 18, ది వాల్ట్ డిస్నీ కంపెనీ(టీడబ్ల్యూడీసీ)కి చెందిన స్టార్ ఇండియాలను విలీనం చేయనుండటంతో జాయింట్ వెంచర్‌లో సరికొత్త సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఈ జాయింట్ వెంచర్‌తో ఏర్పాటుకానున్న సంస్థతో రిలయన్స్‌కు చెందిన ఇతర మీడియా వ్యాపారాలపై ఎలాంటి ప్రభావం చూపదని స్పష్టంచేసింది. టీవీ బ్రాడ్‌కాస్టింగ్‌తోపాటు ఓటీటీ ప్లాట్‌ఫాం సేవలను స్టార్ ఇండియా అందిస్తున్నది. అంతర్జాతీయ మీడియా దిగ్గజం వాల్ట్ డిస్నీ, రిలయన్స్ ఇండస్ట్రీలు తమ మీడియా సంస్థలను విలీనం చేస్తున్నట్లు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ప్రకటించాయి. దీనికి నియంత్రణ మండళ్లు అనుమతించాల్సి ఉంటుంది. ఈ విలీనం తర్వాత ఏర్పడే సంస్థ దేశీయ మీడియా-ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో అతిపెద్ద సంస్థగా అవతరించనున్నది. ఈ సంస్థ చైర్మన్‌గా నీతా అంబానీ, వైస్ చైర్మన్‌గా ఉదయ్ శంకర్ వ్యవహరించనున్నారు. ఈ జాయింట్ వెంచర్‌లో రిలయన్స్‌కు 63.16 శాతం వాటా ఉండనుంగా, డిస్నీకి 36.84 శాతం వాటా ఉండనున్నది.

దివీస్ లాభం 538 కోట్లు

రూ.30 డివిడెండ్ ప్రకటించిన సంస్థ

హైదరాబాద్, మే 25: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ దివీస్ ల్యాబొరేటరీస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.538 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.321 కోట్ల లాభంతో పోలిస్తే 67 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 18 శాతం ఎగబాకి రూ.1,951 కోట్ల నుంచి రూ.2,303 కోట్లకు చేరుకున్నది. మరోవైపు, రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.30 లేదా 1,500 శాతం తుది డివిడెండ్‌ను ప్రతిపాదించింది. ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా శనివారం సమావేశమైన కంపెనీ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.7,845 కోట్ల ఆదాయంపై రూ.1,600 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది.

అరబిందో ఆకర్షణీయం

క్యూ4లో 80 శాతం పెరిగిన లాభం

హైదరాబాద్, మే 25: అరబిందో ఫార్మా ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.909 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2022-23 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.508 కోట్లతో పోలిస్తే 79.6 శాతం ఎగబాకినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ. 6,473 కోట్ల నుంచి రూ.7,580 కోట్లకు ఎగబాకినట్లు వెల్లడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.29 వేల కోట్ల ఆదాయంపై రూ.3,172 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. మొత్తం ఆదాయంలో అమెరికా నుంచి రూ.3,588 కోట్ల ఆదాయం సమకూరగా, యూరప్ నుంచి రూ.1,832 కోట్లు లభించాయి. అలాగే రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కోసం రూ.392 కోట్ల నిధులు వెచ్చించింది. నూతన మార్కెట్లోకి అడుగుపెట్టడం, మార్కెట్లోకి పలు ఔషధాలను విడుదల చేయడం కలిసొచ్చిందని అరబిందో ఫార్మా వైస్-చైర్మన్, ఎండీ కే నిత్యానందా రెడ్డి తెలిపారు.

అందరికీ ఒకే పన్ను?

కేంద్రంలో మళ్లీ మోదీ సర్కారు వస్తే ఇంతేనా! • మదుపరుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు
భారీ మార్పులకే సిద్ధమవుతున్న ఐటీ శాఖ? • దేశీయ మార్కెట్లకు పెను సవాళ్లేనంటున్న నిపుణులు

న్యూఢిల్లీ, మే 25: ఎన్నికల ఫలితాలకు తోడు.. ఇప్పుడు మదుపరులకు మరో భయం జత కలిసింది. ఈ నెలారంభంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,100 పాయింట్లు నష్టపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో మరోమారు బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తే దేశంలో ప్రస్తుతం అమలవుతున్న పన్నుల విధానంలో భారీ మార్పులకే ఆదాయ పన్ను (ఐటీ) శాఖ సిద్ధమవబోతున్నదన్న అంచనాలే ఇందుకు కారణం. పన్ను మినహాయింపులకు కోతలు పెట్టడం, జరిమానాలను ఇంకా పెంచడమే గాక.. అన్ని తరగతులవారికీ ఒకే పన్ను పడేలా ఐటీ శాఖ ముందుకెళ్తోందని అంటున్నారు మరి. ప్రస్తుతం భారత్‌లో ఆదాయాన్ని బట్టి రకరకాల పన్ను శ్లాబులున్న విషయం తెలిసిందే.

ఈక్విటీ ఇన్వెస్టర్లకు దెబ్బ

ఐటీ శాఖ తీసుకురావాలని చూస్తున్న మార్పులు వాస్తవ రూపం దాల్చితే.. దేశీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే మదుపరులకు పెద్ద దెబ్బేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రుణ మార్కెట్లలో మదుపు చేస్తున్నవారితో పోల్చితే ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టేవారికి వివిధ పన్ను ప్రోత్సాహకాలు లభిస్తుండటమే ఇందుకు కారణంగా వారు చెప్తున్నారు. పన్ను ప్రయోజనాలే లేకపోతే చాలామంది స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులకు ముందుకు రాలేరని అంటున్నారు. కాబట్టి పన్ను విధానాల్లో మార్పులు స్టాక్ మార్కెట్ల నష్టాలకు దారితీస్తాయని కూడా మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ హెచ్చరిస్తున్నారు. మరోవైపు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ అంచనాలను కొట్టిపారేస్తున్నా.. ఇన్వెస్టర్లలో ఇప్పటికే నెలకొన్న భయాలు మాత్రం వీడటం లేదు.

ప్రస్తుతానికైతే..

ప్రస్తుతం స్టాక్స్, ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులపై ఏడాదిలోపే లాభాలను అందుకుంటే మదుపరులు దానిలో 15 శాతం స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను (ఎస్‌టీసీజీ)గా చెల్లించాల్సి వస్తున్నది. పెట్టుబడులు పెట్టిన ఏడాది తర్వాత లాభాలను ఆర్జిస్తే అందులో 10 శాతాన్ని దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ)గా కట్టాల్సి వస్తున్నది. ఇక ఒక్కో క్యాపిటల్ అసెట్‌కు ఒక్కోలా ఈ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ పడుతున్నది.

"జూలైలో రాబోయే కేంద్ర బడ్జెట్‌లో మూలధన లాభాల పన్నులో ఏమైనా మార్పులుంటే.. భారతీయ మార్కెట్లలో దిద్దుబాటుకు అవకాశం ఉంటుంది. ఎన్నికల్లో బీజేపీ సాధించే సీట్లు కూడా స్టాక్ మార్కెట్లను నిర్దేశించగలవు. అయితే ఎన్నికల ఫలితం ఎలాగున్నా.. పన్ను విధానంలో మార్పులు మాత్రం భారీ నష్టాలకే దారి తీయగలవు. అదీగాక రిటైల్ ఇన్వెస్టర్లకు క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్‌ను పెంచాలన్న ప్రతిపాదన కూడా వినిపిస్తున్నది. ఏమైనా పన్నుల భారం పెరిగితే మదుపరులు ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడికి లోనుకావచ్చు. 2004లో బీజేపీ ప్రభుత్వం ఓటమిపాలైతే కేవలం రెండు సెషన్లలో మార్కెట్లు 17 శాతానికిపైగా క్షీణించాయి. ఈసారి బీజేపీ ఓడిపోయినా ఆ స్థాయి నష్టాలు రాకపోవచ్చుగానీ.. క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్‌ను సవరిస్తే మాత్రం అంతకన్నా ఎక్కువ నష్టాలు వాటిల్లుతాయని చెప్పవచ్చు.

-క్రిస్టోఫర్ వుడ్, జెఫెరీస్ బ్రోకరేజీ నిపుణుడు

రోజుకు 1,800 కోట్లు

కొనసాగుతున్న ఎఫ్ఐఐల అమ్మకాలు

ముంబై, మే 25: విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు సార్వత్రిక ఎన్నికలు ప్రారంభమైననాటి నుంచి ఇప్పటి వరకు దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులు తరలించుకుపోయారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి మెజార్టీ వచ్చే అవకాశాలు లేవని అంచనాలు వెల్లడికావడంతో విదేశీ మదుపరుల్లో ఆందోళన మరింత పెరిగింది. లోకసభ ఎన్నికలు ప్రారంభమైన ఏప్రిల్ 19 నుంచి ఇప్పటి వరకు 21 రోజుల్లో రూ.37,700 కోట్లను ఉపసంహరించుకున్నారు. నికరంగా రోజుకు రూ.1,800 కోట్లకు పైగా పెట్టుబడులను తరలించుకుపోయినట్లు అయింది. ఇండియా వీఐఎక్స్ సూచీ రికార్డు స్థాయిలో 67 శాతం పెరగడం వల్లనే విదేశీ మదుపరుల్లో ఆందోళన తీవ్రస్థాయికి చేరుకున్నది.

నగదు లావాదేవీలకే సై

కార్లు, కంప్యూటర్లు, ఫోన్లు క్యాష్‌తోనే కొనుగోళ్లు

న్యూఢిల్లీ, మే 25: డిజిటల్ ఆర్థిక సేవలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. దేశవ్యాప్తంగా నగదుతో కొనుగోలు చేసేవారి సంఖ్య అంతకంతకు పెరుగుతున్నారు. ముఖ్యంగా ఐఫోన్లు, కార్లను నగదు రూపంలోనే అత్యధిక మంది కొనుగోలు చేస్తున్నారంట. యాపిల్‌కు దేశవ్యాప్తంగా ఉన్న రెండు స్టోర్లలో డిజిటల్‌కు బదులు నగదు ఇచ్చి తమకు నచ్చినదానిని కొనుగోలు చేస్తున్నారంట. గడిచిన నెలలో వీరి వాటా 7-9 శాతంగా పెరిగింది. ఈ నేపథ్యంలో సంస్థ ఈ రెండు స్టోర్లలో నగదు లెక్కించే యంత్రాలను ఏర్పాటు చేసింది అంటే..డిజిటల్ కంటే నగదు ద్వారానే కొనుగోళ్లకు మొగ్గుచూపుతున్నారో తెలుస్తున్నది.

నగదు చలామణి రెండింతలు

దేశవ్యాప్తంగా నగదు చలామణి రెండింతలు పెరిగింది. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడానికి నరేంద్ర మోదీ సర్కార్ తీసుకుంటున్న చర్యలు బెడిసికొడుతున్నాయి. నల్లధనాన్ని అరికట్టడానికి రోజుకు నగదు ద్వారా జరిపే లావాదేవీలను రూ.2 లక్షలకు నియంత్రించినప్పటికీ నగదు చలామణి మాత్రం ఆగడం లేదు. ఏకంగా రెండింతలు పెరిగి రూ.35.15 లక్షల కోట్లకు చేరుకున్నది. మార్చి 2017లో ఇది రూ.13.35 లక్షల కోట్లుగా ఉండగా, కేవలం ఏడేండ్లలోనే రెండు రెట్లు పెరగడం విశేషం. అలాగే ఇదే సమయంలో యూపీఐ చెల్లింపులు కూడా రూ.19.64 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఏడేండ్లక్రితం ఇది రూ.2,425 కోట్లు మాత్రమేనని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తాజాగా వెల్లడించింది.

15-20 శాతం..

ప్రస్తుతం ఎక్కువ మంది నగదు చెల్లింపులతోనే కార్లను కొనుగోలు చేసున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. దేశవ్యాప్తంగా అమ్ముడవుతున్న కార్లలో 15-20 శాతం నగదు రూపంలోనే కొనుగోళ్లు జరిపారని ది ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అ